క్లుప్తంగా

సత్కారం



వైద్యుడిని సత్కరిస్తున్న దృశ్యం

పాలకోడేరు: జనాభా దినోత్సవం సందర్భంగా అవార్డులు సాధించిన పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యుడు రంగంనాయుడు, ఏఎస్‌ఎం సామ్రాజ్యం, వ్యాసెక్టమీ చేయించుకున్న వ్యక్తికి ప్రోత్సాహక అవార్డు లభించిన నేపథ్యంలో పీహెచ్‌సీలో శుక్రవారం వారిని డాక్టర్ స్వర్ణ నిరంజని ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది శుక్రవారం సత్కరించారు. డాక్టర్ రంగంనాయుడు మాట్లాడుతూ బెస్ట్ మెడికల్ ఆఫీసర్‌గా ఇప్పటికే 8 అవార్డులు తీసుకున్నానన్నారు. సీహెచ్‌వీ సత్యనారాయణ, పీహెచ్‌ఎన్ కుమారి, సూపర్‌వైజర్లు శంకర్, శ్రీనివాస్, అమ్మాజీ, నాగమణి పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణం



32వ వార్డులో సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని 32 వార్డులో సాయిబాబా గుడి రోడ్డు గోతులతో ఉండడంతో ఆప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వెంటనే రూ.60 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మించే పనులకు ఇటీవల శంకుస్థాపన చేశారు. గత రెండు రోజులుగా సీసీరోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణం చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

'పీఎస్‌ఎం' విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు

సాక్షి, భీమవరం: పట్టణంలోని పొట్టిశ్రీరాములు మునిసిపల్ (పీఎస్‌ఎం) గరల్స్ హైస్కూల్లో టెన్త్ చదివిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని స్కూల్ ప్రధానోపాధ్యాయిని జె.సుధారాణి శుక్రవారం విలేకరులకు చెప్పారు. కె.కీర్తిశ్రీరంగశివాని, ఎ.నందిని, టి.మేఘన, టి.సాయిసత్యగీతిక (నూజివీడు), కె.కృష్ణప్రియదర్శిని (శ్రీకాకుళం) ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో సీట్లు పొందారన్నారు. అనంతరం విద్యార్థులను సుధారాణి, వారణాసి రాధాకృష్ణ తదితరులు అభినందించారు.

వలంటీర్ల సేవలను ప్రజలు మెచ్చారు



విస్సాకోడేరులో లబ్ధిదారులకు బ్రోచర్లు అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



విస్సాకోడేరులో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నేతలతో పీవీఎల్

- వారిపై పవన్ వ్యాఖ్యలు దారుణం
- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- విస్సాకోడేరులో ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం

పాలకోడేరు: రాష్ట్రంలో వలంటీర్లు అందిస్తున్న సేవలను ప్రపంచం అంతా గుర్తించి ప్రశంసిస్తుంటే వారిపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ నీచంగా, అనుచితమైన వ్యాఖ్యలు చేయడం దారుణమని డీసీసీబీ చైర్మన్ నర్సింహరాజు అన్నారు. శుక్రవారం విస్సాకోడేరు సచివాలయం 2 పరిధిలో శుక్రవారం ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పీవీఎల్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆయనకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సీఎం వైఎస్ జగన్ పాలనలో ఎంతో ఆనందంగా ఉన్నామని చెబుతున్నారన్నారు. మళ్లీ వైఎస్ జగన్ అధికారంలోకి రాకపోతే వలంటీర్ వ్యవస్థ రద్దు అవుతుందేమోనని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవేమో అని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారన్నారు. అందుకే మళ్లీ వైఎస్ జగన్ అధికారంలోకి రావాలని, ముఖ్యమంత్రి అవ్వాలని కోరుకుంటున్నారని అన్నారు. కొంతమంది ఇంటికి వెళ్లినప్పుడు ప్రజలు ధ్రువీకరణ పత్రాల కోసం అడిగారని, దీనికోసమే జగనన్న సురక్ష పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఈ నెల 18 నుంచి వలంటీర్లు ఇంటింటికి తిరిగి ఎవరికి ఏ పత్రాలు కావాలో సర్వే చేసి 25వ తేదీన జరిగే జగనన్న సురక్ష పథకం కార్యక్రమంలో 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. వైఎస్ జగన్ పాలనలో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని వారు చెబుతున్నారని అన్నారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

గ్రామంలో టీడీపీ, జనసేనకు చెందిన 30 మందికి పైగా కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరిని డీసీసీబీ చైర్మన్ నర్సింహరాజు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న పాలన మెచ్చి పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు, సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, మాజీ సర్పంచులు పెన్మత్స శ్రీనివాసరాజు, చల్లబోయిన పాపారావు పిన్నమరాజుమాగ్రాజు (బాబు), పిన్నంరాజు పృధ్వీరాజ్, ఆరేపల్లి శ్రీనివాస్, పిన్నమరాజు సహదేవరాజు, ఎంపీటీసీలు బొల్లం గాంధీ, లక్ష్మీపతి, కాటూరి శాంతకుమారి, పెన్మత్స వెంకటలక్ష్మి, తోట ఆలిస్ మేరీ, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యురాలు డాక్టర్ డీఆర్ స్వర్ణలత, రిచి కీట్స్, సొసైటీ చైర్మన్ గెద్దం జోషి గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు, గుండు నాగేశ్వరరావు, సాగిరాజు హరివర్మ, సర్పంచులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, గొట్టుముక్కల శివాజీరాజు, జంగం సూరిబాబు, వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మీ తులసి, బొక్కా రాంబాబు పాల్గొన్నారు.

వలంటీర్ చొరవతో పింఛను వచ్చింది

వలంటీర్లకు వందనం



వలంటీర్ గోతే హరీష్ అందిస్తున్న సేవలు మరచిపోలేం. ముఖ్యంగా మా కుటుంబానికి జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాతనే వెలుగు వచ్చింది. నా పేరు పెద్దింటి ఫణిదేవీ లక్ష్మీసుభ్రధ. నా భర్తపేరు శేషుకుమార్. నాకు 75 శాతం దృష్టిలోపం ఉంది. గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు పింఛన్ కొరకు దరఖాస్తు చేసినా ఎవ్వరూ కనికరించలేదు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత వలంటీర్ గోతే హరీష్ సహకారంతో సదరం సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేయగా, పరీక్ష చేసి సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో పింఛనుకు దరఖాస్తు చేయడంతో మంజూరైంది. నావల్ల నా భర్తకు ఎటువంటి సహకారం లేదని బాధపడేదానిని. కానీ ఇప్పుడు జగనన్న ప్రభుత్వంలో ప్రతి నెలా రూ.3 వేలు దివ్యాంగ పింఛను అందుకుంటున్నాను. మొదటి తేదీ ఉదయాన్నే వలంటీర్ వచ్చి పింఛన్ సొమ్ము ఇస్తుంటే చాలా ఆనందంగా ఉంటుంది. ఏనెలలోనూ పింఛను సొమ్ము అందించడంలో ఆలస్యం చేయలేదు. అలాగే ఇతర సంక్షేమ పథకాల వివరాలను వలంటీర్ తెలియజేస్తారు. వలంటీర్‌ల వ్యవస్థ ద్వారా మాలాంటి వాళ్లు ఎంతో మంది నిస్సహాయులు పింఛన్, వివిధ పథకాలు పొందుతున్నారు. – పెద్దింటి ఫణిదేవీ లక్ష్మీప్రసన్న, శివాలయం వీధి, పాందువ్వ

కలెక్టర్‌ను కలిసిన శాలివాహన కార్పొరేషన్ చైర్మన్

భీమవరం(ప్రకాశం చౌక్): ఏపీ శాలివాహన, కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ ఎం.పురుషోత్తం, సభ్యులు శుక్రవారం కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాద పూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ శాలివాహన, కుమ్మరి సామాజికవర్గం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాలను పొందుతున్నారని, అన్ని అంశాలలో అభివృద్ధి చెందడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమ శాఖా అధికారి జీవీఎస్‌కే గణపతిరావు, సభ్యులు బిరుదుకోట చింతన్న, పెనుగొండ లక్ష్మి, సకినేటిపల్లి ఉమామహేశ్వరరావు, యర్రవరపు రామకృష్ణ పాల్గొన్నారు.



కలెక్టర్ ప్రశాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

19న మండల పరిషత్ సమావేశం

భీమవరం అర్బన్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి శుక్రవారం తెలిపారు. మండల పరిషత్ సమావేశం మందిరంలో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు అందరూ హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

నూరుశాతం 'మధ్యాహ్న' భోజనం చేయాలి



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న కృష్ణారావు

సాక్షి, భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు విద్యతో పాటు పోషకాలతో కూడిన భోజనం అందించేందుకు ప్రాధాన్యం ఇస్తోందని మధ్యాహ్న భోజనం, పాఠశాల పారిశుద్ధ్య ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ కె.కృష్ణారావు అన్నారు. పట్టణంలోని దుర్గాపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, డాక్టర్ బీఆర్ రాజు మున్సిపల్ హైస్కూళ్లను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. స్కూళ్లలో ఆహార పదార్థాల నాణ్యత, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులకు వారంలో ఐదు రోజులు కోడిగుడ్లు, మూడు రోజులు రాగి జావా, చిక్కీలతో పాటు తీపి పొంగలి, పులిహోర, పోషక విలువలు గల ఆకుకూరలు, కూరగాయల బిర్యాని వంటి వంటకాలను విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. పాఠశాలల్లోని విద్యార్థులు నూరుశాతం మధ్యాహ్న భోజనం చేసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హెచ్‌ఎంలు షేక్ బాబాజీసాహెబ్, వి.విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 630 మందికి పరీక్షలు



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజు ప్రారంభించారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు పుట్టినరోజు సందర్భంగా ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ వైద్య శిబిరంలో 630 మందికి పరీక్షలు చేసినట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌జే సోమరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆకివీడు: గోకరాజు గంగరాజు పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఆకివీడులో అనాథాశ్రమం, బాలసదన్‌లో, పేదలకు అన్నదానం చేశారు. నేరెళ్ల పెదబాబు, కట్రెడ్డి ఏడుకొండలు పాల్గొన్నారు.

మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

ఉండి: ఆరేడులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన భీమాపుడియామి, సనేష్‌కుమార్ మృతి చెందగా, మృతదేహాలకు శుక్రవారం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై కే గంగాధరరావు చెప్పారు. గురువారమే ప్రమాద విషయాన్ని బంధువులకు తెలియచేయడంతో ఇరు కుటుంబాలకు చెందిన బంధువులు, కుటుంబ సభ్యులు, ఆయా గ్రామ పెద్దలు భీమవరం ప్రభుత్వాసుపత్రికి రావడంతో పోస్టుమార్టం అనంతరం వారికి మృతదేహాలను అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

'ఎస్ఆర్‌కేఆర్'కు 3వ ర్యాంక్

సాక్షి, భీమవరం: ప్రతిష్టాకరమైన టైమ్స్ గ్రూప్ రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలలపై నిర్వహించిన ర్యాంకింగ్ సర్వే 2023లో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు మూడో ర్యాంక్ లభించిందని కళాశాల సెక్రటరీ సాగి రామ కృష్ణనిశాంత్‌వర్మ చెప్పారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు.. కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిషాంతవర్మకు అభినందనలు తెలిపారు. కెరీర్ 360 సంస్థ కూడా నిర్వహించిన సర్వేలో తమ కళాశాలకు ట్రిపుల్ ఎ ప్లస్ ర్యాంక్ ప్రకటించిందన్నారు. కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా సమావేశం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం చినరంగనిపాలెంలో గౌడ, శెట్టిబలిజ, శ్రీశైన, యాత, ఈడిగ జిల్లా సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు గౌడ, శెట్టిబలిజ సంఘం జిల్లా అధ్యక్షులు వేండ్ర వేంకటస్వామి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఈ సమావేశం ఉంటుందని గౌడ, శెట్టిబలిజ, శ్రీశైన, యాత, ఈడిగ ప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఆషాఢ సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): మెంటేవారితోటలో వేంచేసియున్న బాలత్రిపుర సుందరిదేవి అమ్మవారికి భక్తులు శుక్రవారం అషాఢ మాస సారె సమర్పించారు. అలాగే ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణానికి చెందిన తోట కృష్ణ, లక్ష్మీ దంపతులు అమ్మవారికి సుమారు 55 రకాల స్వీట్స్, పండ్లు, చీర, గాజులు, పసుపు, కుంకుమ తదితర వాటిత అమ్మవారికి అషాడమాస సారే సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆకివీడులో నూకాలమ్మకు..

ఆకివీడు: స్థానిక శాంతినగర్‌లో వేంచేసియున్న నూకాలమ్మ అమ్మవారికి మహిళలు ఆషాఢ మాస సారెను శుక్రవారం సమర్పించారు. వివిధ రకాల పిండి వంటలు, స్వీట్లతో మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంతి ప్రధానోపాధ్యాయురాలు కాకర్ల రాజ రాజేశ్వరి మాట్లాడుతూ ఆషాఢ మాస విశిష్టతను, అమ్మవార్ల అనుగ్రహాన్ని వివరించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఖరీఫ్ వరిసాగుకు నీటి కొరత లేదు



సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల సీతారామయ్య

ఆకివీడు: ఖరీఫ్ వరి సాగుకు నీటి కొరత లేదని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి ఎగువ భాగంలో కురుస్తున్న వర్షాలకు నీటి ఇబ్బంది ఉండదన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ పంట సాగు ఆలస్యమవుతున్నప్పటికీ పంటకు ఇబ్బందిలేదన్నారు. నాట్లు వేసే సమయానికి పూర్తి స్థాయిలో నీరు అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రస్తుతం పంట కాల్వల్లో ఉన్న నీటిని రైతులు పొదుపుగా వాడాలన్నారు. పంట కాల్వలకు ఉన్న షట్టర్లను వినియోగించాలని సూచించారు. షట్టర్లు పాడైపోయిన వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని నీటి పారుదల శాఖ అధికారులను కోరారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆర్బీకే ఇన్‌ఛార్జిలు, వ్యవసాయాధికారులు సహకరించి ఆయా పంట కాల్వల్లోని నీటి వినియోగాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా సహకరించాలన్నారు. దొడ్డనపూడి కాలువకు పాడైపోయిన షట్టర్‌ను వెంటనే అమర్చాలని ఏఈని ఆదేశించారు. ఆర్బీకే ఇన్‌చార్జి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ దొడ్డనపూడి ఛానల్‌కు షట్టర్ పాడైపోతే మరమ్మతులు చేయించలేదని, నీరు వృద్ధాగా పారుతోందని వాపోయారు. దీనిపై చైర్మన్ సీతారామయ్య మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితమే పాడైందని, త్వరలోనే మరమ్మతులు చేయిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, రైతులు ఫోన్ చేసినప్పుడు అధికారులు వెంటనే స్పందించాలని ఎంపీడీఓ కందుల వాణి ఆదేశించారు. సమావేశంలో ఏడీఏ కెఎస్ఎస్.శ్రీనివాసరావు, ఎఫ్‌డీఓ వివేక్, పీడబ్ల్యూడీ ఏఈ జీ.రాము, ఆర్బీకే ఇన్‌చార్జిలు ఎరిచర్ల సాంబర్లిన్, తోట శివాజీ, కేశిరెడ్డి దుర్గారావు పాల్గొన్నారు.

సీసలిలో ఇళ్ల పట్టాల పంపిణీ



సీసలిలో పట్టాల పంపిణీ చేస్తున్న పీవీఎల్

కాళ్ల: అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. సీసలిలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పీవీఎల్ చేతుల మీదుగా అందజేశారు. కోలనపల్లిలో సీసలి గ్రామానికి చెందిన 100 మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారు. అయితే కోర్టులో క్లియరెన్స్ రావడంతో పట్టాల పంపిణీ చేశారు. ముందుగా 15 మందికి పట్టా ఇవ్వగా మిగిలిన వారికి కూడా పట్టాలు పంపిణీ చేస్తారని మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బిళ్ళకుర్తి ధనలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, ఉప సర్పంచ్ బాతు మాణిక్యాలరావు, కట్రెడ్డి రామచంద్రరావు, గ్రామ పెద్దలు అధికారులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

ఉండి: వెలివర్రు ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌పై గత మండలస్థాయి సామాజిక తనిఖీ సమావేశంలో గ్రామ పెద్దలు, కొందరు ప్రజలు చేసిన ఫిర్యాదుపై ఏపీడీ రాజేశ్వరి శుక్రవారం గ్రామంలోని పలు ప్రాంతాల్లో విచారణ చేసినట్లు ఎంపీడీవో ఏవీ అప్పారావు చెప్పారు. ఆరోపణలపై ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని జిల్లా ఉన్నతాధికారులకు ఆమె తెలియచేస్తారన్నారు.

ఆకివీడు ఎస్సైగా సత్యసాయి



టి.సత్యసాయి

ఆకివీడు: ఆకివీడు ఎస్సైగా టి.సత్యసాయి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన కే.రాజారెడ్డి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. భీమవరం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ వీఆర్‌లో ఉన్న సత్యసాయిని ఆకివీడుకు ఎస్సైగా నియమితులయ్యారు.

జాబ్ మేళాలో 113 మందికి ఉద్యోగాలు



దుంపగడప జాబ్ మేళాలో ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న యువకులు

ఆకివీడు: దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 113 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు లభించాయి. జాబ్‌మేళాకు వివిధ ప్రాంతాల నుంచి 300 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 13 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించగా 113 మంది అభ్యర్థులు విజయం సాధించారు. వారికి నియామక పత్రాల్ని అందజేశారు. తొలుత మెగా జాబ్ మేళా ప్రారంభోత్సవ సభ కళాశాల ఆవరణలోని బీ.స్వరాజ్యలక్ష్మీ సెమినార్ హాల్‌లో జరిగింది. సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరగుతున్నజాబ్ మేళా కార్యక్రమాలు నిరుద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. కళాశాల ఆవరణలో నిర్వహించిన రెండవ మెగాజాబ్‌మేళాతో సుమారు 300 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పినట్లు చెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగులు ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా విద్యా బోధనతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే ఎం.రామరాజు, ప్రిన్సిపాల్ కే. సుజాత, నైపుణ్యాభివృద్ధిసంస్థ జిల్లా అధికారి ఏ. కృష్ణారెడ్డి, కళాశాల సీపీడీసీ కార్యదర్శి డాక్టర్ పీబీ.ప్రతాప్ కుమార్, కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఎస్‌వీ.రామరాజు పాల్గొన్నారు.

వెండి వస్తువుల సమర్పణ

ఆకివీడు: స్థానిక మాదివాడలో వేంచేసియున్న పుంతలో ముసలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. జాతర సందర్భంగా అమ్మవారికి తోట సుబ్బారావు, పోతిరెడ్డి ధనరాజు కుటుంబీకులు రూ.80 వేల వెండి మకర తోరణం, వెండి పూజా సామగ్రి అందజేయగా, అమ్మవారికి అలంకరించారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని గ్రామంలో ప్రభలతో ఊరేగించారు. వివిధ శక్తి వేషాలు, సన్నాయి మేళాలు, గరగ నృత్యాలతో పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆరేటి త్రిమూర్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేశిరెడ్డి మురళీ, నంద్యాల సీతారామయ్య, పుప్పాల పండు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

నేడు యండగండిలో జగనన్న సురక్ష

ఉండి: జగనన్న సురక్ష కార్యక్రమం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో శనివారం యండగండిలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు శుక్రవారం తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలంతా వినియోగించుకుని వివిధ ధ్రువ పత్రాలు పొందాలని, సమస్యలను అధికారుల దృష్టికి తేవాలని తెలిపారు.

ఎంఈవో–1గా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

భీమవరం అర్బన్: భీమవరం ఎంఈవో–1గా ఎన్.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాసరావు తాడేపల్లిగూడెంలోని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేసి పదోన్నతిపై ఇక్కడకు బదిలీపై వచ్చారు. శ్రీనివాసరావును ఎంఈఓ–2 వేండ్ర వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

మావుళ్లమ్మ సేవలో ఎమ్మెల్సీ శివనాథరెడ్డి



ఎమ్మెల్సీ శివనాథరెడ్డికి మావుళ్లమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారిని కడప జమ్మలమడుగు ఎమ్మెల్సీ సి.శివనాథరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ వేద ఆశీర్వచనం అందించి అమ్మవారి ప్రసాదాన్ని, ఫొటోను అందజేశారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ, ధర్మకర్త తాళ్లపూడి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

కాళ్ల: బాలిక అదృశ్యంపై కాళ్ల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. ఎల్ఎన్ పురంలో ఓ బాలిక శుక్రవారం ఉదయం బయటకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో బాలిక అదృశ్యం వెనుక కోపల్లె గ్రామానికి చెందిన రాహుల్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ బాలిక సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రామరాజు తెలిపారు.